శిథిల భవనాలే దిక్కు!

- కూలేందుకు సిద్ధంగా ప్రభుత్వ కార్యాలయాలు
- బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలోనే ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ భవనం కూలిపోతుందో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సంపద సృష్టిస్తామంటున్న కూటమి నేతలు ప్రగల్భాలు పక్కన పెట్టి కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించేలా దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన ఎంపీడీవో కార్యాలయ భవనం

శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం

ఇదీ పరిస్థితి..

మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల భవనాలతో పాటు వెలుగు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ భవన సముదాయం ఇలా అన్ని భవనాలు శిథిలావస్థలకు చేరి కూలిపోయే దశలో ఉన్నాయి. పెచ్చులూడిన శ్లాబులు, సగం ఊడి చెదలు పట్టిన కిటికీలు, విరిగిన తలుపులు, పగిలిన ఫ్లోర్ టైల్స్, మార్బుల్స్, గచ్చులతో ఆయా కార్యాలయాలు అధ్వానంగా దర్శనం ఇస్తున్నాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా పెచ్చులూడిన శ్లాబుల ద్వారా వర్షం నీరు కారుతుందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడకు వివిధ పనులపై వచ్చే ప్రజలు కూడా శిథిల భవనాలను చూసి భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండల పరిషత్ భవనం దిష్టి బొమ్మాలా దర్శనమిస్తోంది. 2017లో రూ. కోటి రూపాయలు వెచ్చించి అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ శంకుస్థాపన చేశారు. నేటికీ అది పూర్తి కాలేదు. దాదాపు 70 శాతం పనులు పూర్తయినా దాని కోసం పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు. ప్రస్తుతం ఆయన తనయ గౌతు శిరీష ఎమ్మెల్యేగా ఉన్నారు. అయినప్పటికీ మండల పరిషత్ భవనం పూర్తి చేసేందుకు శ్రద్ధ తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. తాము అధికారంలోకి వస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వ నేతలు ఆ ఊసే ఎత్తడం లేదు.

గత్యంతరం లేక ప్రస్తుతం శిథిలమైన భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మరో పక్క పదేళ్ల కిందట రూ.45 లక్షలతో నిర్మించిన సెర్ప్ వెలుగు కార్యాలయం సైతం ప్రారంభానికి నోచుకోక శిథిలమైంది. కొద్దిపాటి నిధులు ఖర్చు చేస్తే ఈ భవనం వినియోగంలోకి వస్తుంది.

దిష్టి బొమ్మలా..



చెదలు పట్టిన తలుపులు, కిటికీలతో ఉపాధి కార్యాలయం



ప్రారంభానికి నోచుకోక పొదల మధ్య నిరుపయోగంగా ఉన్న వెలుగు భవనం

పదేళ్లకే శిథిలం..

వెలుగు, ఉపాధి హామీ పథకం భవనం నిర్మించిన పదేళ్లకే శిథిలమయ్యాయి. తలుపులు, కిటికీలు, గచ్చులు, టైల్స్, మార్బుల్స్ ఊడిపోయాయి. గోడలు బీటలు వారాయి. దాదాపు రూ.80 లక్షలతో నిర్మించిన భవనం నాణ్యత డొల్ల బయట పడింది. తలుపులకు వాడిన కలప, ఐరన్ నాణ్యత లేకపోవడంతో చెదలు పట్టి ఊడిపోయాయి. సుమారు రూ.50 లక్షల విలువైన కంప్యూటర్లు, ఫైల్స్, ఇతర సామగ్రి ఆ భవనంలోనే ఉన్నాయి. వీటి రక్షణ గాలిలో దీపంలా ఉంది. వీటి మరమ్మతులపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాల్సి ఉంది.

క్లుప్తంగా

పిల్లలకు ఆట వస్తువులు వితరణ



ఆట వస్తువులు, స్కూల్ బ్యాగులతో విద్యార్థులు

టెక్కలి: బొరిగిపేట ప్రాథమికోన్నత పాఠశాల పిల్లలకు డిజైనర్ రాక్స్ గ్రానైట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆట వస్తువులు, స్కూల్ బ్యాగులను వితరణగా అందజేశారు. ఈ మేరకు శనివారం కంపెనీ మేనేజర్ నారాయణ నేతృత్వంలో సుమారు 140 మంది పిల్లలకు రూ. 1.30 లక్షల విలువైన వస్తువులను అందజేశారు. కంపెనీ ప్రతినిధి ఎస్.రామారావు, ప్రధానోపాధ్యాయుడు సురేష్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ ఎ.మాధవరావు, గ్రామ పెద్దలు డి.కామన్న, కె.శ్రీరాములు, బి.రాజు, డి.రాఘవరావు, ఎస్.డిల్లేశ్వర్రావు, బి.శ్రీకాంత్, వెంకట్రావు ఉన్నారు

విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం



పురస్కారాలు అందజేస్తున్న ఏపీఎన్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

టెక్కలి: ఏపీ నిరుద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ నమూనా పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శనివారం పురస్కారాలు ప్రదానం చేశారు. స్థానిక ఎస్వీ ఆర్కే కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సూర్యం ఆధ్వర్యంలో విద్యార్థులు కె.చరణ్, హర్షవర్ధన్, కీర్తన, అస్మిత, గౌతమిలకు పురస్కారాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌తో పాటు రమేష్, మధు, పాపారావు, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు సహకరించండి



కంచిలిలో చెత్త సేకరణ డబ్బాలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో తిరుమలరావు

కంచిలి: పంచాయతీల ద్వారా చేపడుతున్న చెత్త సేకరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని స్థానిక ఎంపీడీవో వి.తిరుమలరావు కోరారు. కంచిలి, జలంత్రకోట, గోకర్ణపురం పంచాయతీల్లోని ప్రజలకు తడి, పొడి చెత్తను వేసేందుకు డబ్బాలను శనివారం పంపిణీ చేశారు. చెత్తను ఇంటింటికీ వచ్చే గ్రీన్ అంబాసీడర్లకు అందజేయాలని సూచించారు. ఏపీవో జి.ధనుంజయ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు , సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాభ్యాసంతోనే మానసిక ప్రశాంతత



యోగాసనాలు వేసి ఉపయోగాన్ని వివరిస్తున్న శిక్షకులు

కంచిలి: యోగాభ్యాసం చేయడంతోనే ప్రతి మనిషికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు చేపడుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల్లో భాగంగా నాలుగో రోజున యోగాభ్యాసంపై సోంపేటకు చెందిన సత్యం, ఢిల్లీశ్వరరావు, కుమారి ధరిష్మలు యోగాసనాలు వేసి, వాటి ఉపయోగాన్ని వివరించారు. యోగాసనాలపై అవగాహన కల్పించిన ముగ్గురు శిక్షకులను దుశ్శాలువలతో సన్మానించారు. ఎంఈఓ-2 కె.చిట్టిబాబు, ఐసీడీఎస్ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు



సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

టెక్కలి: టెక్కలి అరుణా విద్యాలయంలో శనివారం నిర్వహించిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు డి.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థులు సుమారు వందకు పైగా ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా సైన్స్ ప్రదర్శనలను తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. పలు ప్రాజెక్టులను విజేతగా ప్రకటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.రవి, టి.హేమలత, జయశ్రీ, శ్రీదేవి, మోహన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణ పనుల పరిశీలన

కవిటి: మండలంలోని కవిటి బీచ్ రోడ్‌లో నిర్మాణంలో ఉన్న కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయ పనులను విశాఖపట్నం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఇంజినీరింగ్ విభాగం ఈఈ ఈఏ వెంకటరమణ శనివారం పరిశీలించారు. కవిటి బీచ్‌రోడ్డులో నిర్మిస్తున్న ఈ ఆలయం అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శ్రీవాణి ట్రస్ట్ పథకం ద్వారా సుమారు 10 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో పనులు జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఇంజినీరింగ్ సిబ్బంది జి.యశ్వంత్ శ్రీరామ్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ తదితరులు దేవాలయంలో కొలతలు తీసి పరిశీలించారని మండల ఆకోప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ నిర్మాణకర్త బి.పాపయ్య రెడ్డి, ఆరింగి మధు, మొగిలిపురి సీతారాం, పొల్లయి దుర్యోధన, పొల్లయి మండల హిమాచలం, రాజేష్, లోకనాథం బెహరా పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది

ఘనంగా మాజీ మంత్రి అప్పలరాజు జన్మదిన వేడుకలు

కాశీబుగ్గ: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పూజలు చేశారు. పలాసలో పార్టీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. మందసలో ఎంపీపీ డొక్కరి దానయ్య ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు జరిగాయి. పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావుదొర, పీసీఎంఏ అధ్యక్షులు మల్లా సురేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వజ్రపుకొత్తూరు: అప్పలరాజు జన్మదిన వేడుకలను వజ్రపుకొత్తూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కాటకాన మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశవరావు, మండల పార్టీ అధ్యక్షుడు తిర్రి రాజరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



కాశీబుగ్గ: పలాసలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వైభవంగా జలయాత్ర పూజలు

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్ది గ్రామదేవత తోటమ్మ తల్లి అమ్మవారి ఆలయం సింహద్వార ప్రతిష్ట ఉత్సవాలలో భాగంగా శనివారం జలయాత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు నారాయణ పాఢి ఆధ్వర్యంలో గ్రామస్తులంతా పవిత్ర జలాలతో యాగశాల సంప్రోక్షణ పూజలతో యజ్ఞాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా పవిత్ర నదీజలాలు, దేశంలోని ప్రముఖ నదులలోని జలాల్ని ఈ జలయాత్ర పూజలలో భాగంగా అభిషేకాలు చేసి యాగశాలలో సిద్ధం చేశారు. ఆదివారం సింహద్వార ప్రతిష్ట, లోక కల్యాణార్థం శాంతి హోమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



జలయాత్ర పూజల్లో భక్తులు

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ఇచ్ఛాపురం రూరల్: స్వయం సహాయక సంఘాల మహిళలు తమ అంతర్గత పొదుపుల నుంచి అప్పులు తీసుకొని ఆర్థికాభివృద్ధి కోసం వినియోగించాలని సెర్ప్ ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. కేసుపురంలో శనివారం నిర్వహించిన డ్వాక్రా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం సూర్యఘర్ యోజన, షెడ్ నెట్ వ్యవసాయం, ఈ-శ్రమ్ కార్డులను ఉపయోగించుకోవాలని, ప్రతి ఇంటిలో హోం కంపోస్ట్, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. గ్రామ సంఘం అధ్యక్షురాలు రేనా, వీవోఏ కల్పన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాదరావు

చిన్నపిల్లలపై ట్రోల్స్ సిగ్గు సిగ్గు

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు చాందిని

టెక్కలి: కూటమి నాయకులు తమ రాజకీయ స్వార్థం కోసం అభం శుభం తెలియని చిన్నారులపై సోషల్ మీడియాల్లో ట్రోల్ చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు గొండు చాందిని విచారం వ్యక్తం చేశారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ పర్యటనలో భాగంగా ఓ బాలిక తన అభిమానాన్ని చాటుకున్న నేపథ్యంలో అది తట్టుకోలేని కూటమి నాయకులు సభ్య సమాజం తలదించుకునే విధంగా సోషల్ మీడియాల్లో దుష్ప్రచారం చేయడం తగదన్నారు. చిన్నారులపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు.



మాట్లాడుతున్న గొండు చాందిని

ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలిద్దాం

కాశీబుగ్గ: ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలిద్దామని.. దీనికి వ్యాపారులు సహకరించాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ వ్యాపారస్తులతో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయించవద్దన్నారు. ఎవరైన సరుకుల కోసం వచ్చేటప్పుడు విధిగా గుడ్డ సంచిని తీసుకొని రావాలని అవగాహన కల్పించాలని వ్యాపారులకు సూచించారు. ప్లాస్టిక్ విక్రయిస్తూ దొరికితే మూడు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేష్, ఉదయ్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

నేడు తలగాంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట

టెక్కలి: తలగాం గ్రామంలోని విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యస్వామి, పార్వతీదేవి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంతో పాటు మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం వల్లీ సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ దుంపల వైకుంఠరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి..అర్హత ఉన్నవారు ఏపీఎంఎస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 91774 58429 నంబర్‌కి సంప్రదించాలన్నారు.

నీలగిరి, టేకు తోటల్లో అగ్ని ప్రమాదం

కంచిలి: డోలగోవిందపురం పంచాయతీ పరిధి రేఖాదేవిపుర గ్రామంలో అర్జునాపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో ఉన్న నీలగిరి, టేకు తోటల్లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. కొంతవరకు చెట్లు కాలిపోయాయి. బత్తుల క్రిష్టారావు, కరక లచ్చయ్య, బరాటం భానుమతి, బుడ్డెపు కామేష్‌రెడ్డిలకు చెందిన పది ఎకరాల తోటల్లో ఈ ప్రమాదం చోటుచేసుకొంది. సోంపేట అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేసి ప్రమాదాన్ని నివారించారు.

పూర్వవిద్యార్థుల ఔదార్యం



హెచ్‌ఎం శివరాంప్రసాద్‌పాఢికి ప్రింటర్‌ను అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

కవిటి: రాజపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2001 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. చదువుకున్న పాఠశాలకు 20 వేల రూపాయల విలువైన ప్రింటర్‌ను కొనుగోలు చేసి హెచ్‌ఎం శివరాంప్రసాద్‌పాఢికి శనివారం అందజేసి ఆదర్శంగా నిలిచారు.

అలరించిన గాత్ర కచేరీ



కచేరీ చేస్తున్న కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: బొడ్డబాళి గ్రామంలోని కళ్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. చుట్టుపక్కల నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గాత్ర కచేరీ శ్రోతలను అలరించింది. కొత్త లావణ్య గాత్రంతో అన్నమయ్య, త్యాగరాజు కీర్తనలు ఆలపించారు. నారద కృష్ణమూర్తి కీబోర్డు, ఆచారి డోలక్‌తో సహకరించారు.

నీటి కోసం నిరసన..



టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి పలు వీధుల్లో నీటి సమస్య నెలకుంది. దీంతో సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎన్టీఆర్ కాలనీలో మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. కొన్ని వీధుల్లో కుళాయిలు ఉన్నప్పటికీ సక్రమంగా నీరు రావడం లేదని, మరికొన్ని వీధులకు నీటి సదుపాయం లేదంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి ఆరంభంలోనే నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని దీనిపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. –టెక్కలి

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి



ప్రభుత్వ పాఠశాలల్లోనే చిన్నారులను చేర్పించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. కంచిలి మండలంలోని బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం గ్రామంలో శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.సోమేశ్వరరావు ఉపాధి పనులు చేస్తున్న చోటకు వెళ్లి మహిళా వేతనదారులకు ప్రభుత్వ బడుల్లో చేర్పించడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ఉపాధ్యాయులు శంకరరావు, ధర్మారావు, రోజా, శివరాం బెహరా, నిరంజన్ ఖడంగా, కాంతారావు, జగన్ మోహన్, హరిక్రిష్ణ, లక్ష్మీపుసరాజులు పాల్గొన్నారు. –కంచిలి

డాక్టరేట్ ప్రదానం



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ బెల్లుపడకు చెందిన ఆశి లక్ష్మీప్రియాంక ఏయూలో కామర్స్‌అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో డాక్టరేట్ పొందారు. రోల్ ఆఫ్ఏఐపవర్డ్‌స్మార్ట్ స్పీకర్ ఇన్ షేపింగ్ ఈ కస్టమర్స్ బిహేవియర్ అండ్ పర్చేజింగ్ పాట్నర్స్, ఏస్టడీ ఆన్ సెలెక్ట్ సిటీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్, ఇండియా అనే అంశంపై ప్రొఫెసర్ ఎం.రమాదేవి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.ధనుంజయరావు నుంచి శనివారం డాక్టరేట్ అందుకున్నారు. –ఇచ్ఛాపురం టౌన్

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

సోంపేట: ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవని సోంపేట మేజర్ పంచాయతీ ఈవో శాంతికుమారి వ్యాపారస్తులకు సూచించారు. సోంపేట పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. చెత్తతో సంపద సృష్టించడానికి ప్రజలు సహకారం అందించాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి ఇంటికి వచ్చే సిబ్బందికి అందించాలన్నారు. పంచాయతీ, వెలుగు, ఐసీడీఎస్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్: అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజా భాగస్వామ్యంతో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఇచ్ఛాపురం రూరల్ ఎస్సై ఇ.శ్రీనివాస్ తెలిపారు. మశాఖపురం గ్రామ పంచాయతీలో శనివారం పర్యటించి స్థానిక గ్రామ పెద్దలతో మాట్లాడారు. ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలు కీలకమన్నారు. దాతలు ముందుకు వచ్చి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.



మశాఖపురంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఎర్రగెడ్డ ఆక్రమణలను తొలగించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: రెయ్యిపాడు, కొండవూరు పంచాయతీల పరిధిలోని ఎర్రగెడ్డ అక్రమాలను తొలిగించాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు కోరారు. ఈ మేరకు స్థానికంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులను స్థానిక నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎర్రమట్టి దిబ్బలతో ఎర్రగెడ్డ ప్రకృతి అందాలలో చూపరులను అకట్టుకుంటుందన్నారు. ఈ గెడ్డ ద్వారా వరద ప్రవహించి ఉద్యాన పంటలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అయితే సుమారు 70 ఎకరాల్లో విస్తీర్ణంలో ఉన్న ఈ గెడ్డను కొంత మంది ఆక్రమించుకున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ భూములను కాపాడుతామని అన్నారు. కీలు మాణిక్యం, బి.నాగరాజు, సురేష్ ఉన్నారు.



అక్రమాలను చూపిస్తున్న దుర్గారావు

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వినతి

కంచిలి: అంపురం గ్రామం రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ వద్ద రోడ్డు మరమ్మతులకు గురైందని..దీన్ని వెంటనే మరమ్మతులు చేయాలని జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాసరావు రాళో సోంపేట పీడబ్ల్యూవో కార్యాలయ అధికారి ని కోరారు. అంపురం ప్రాంతీయులంతా కలిసి శనివారం ఈ విషయమై జడ్ఆర్‌యూసీసీ సభ్యుడి దృష్టికి సమస్యను తీసుకురావడంతోపాటు పరిస్థితిని స్వయంగా చూపించి వివరించారు. దీంతో ఆయన పీడబ్ల్యూవోను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రోడ్డు పాడవ్వడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు లెవెల్ క్రాసింగ్ చేసే సమయంలో ఇబ్బందులకు గురౌతున్నారని వివరించారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

అధ్యాపకునికి అభినందనలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న అంపోలు రామారావు తన సొంత ఖర్చులతో ప్రిన్సిపాల్ విభాగాన్ని మరమ్మతులు చేయించారు. దీంతో అతన్ని కళాశాల అధ్యాపకులు శనివారం అభినందించారు. సుమారు రూ.40 వేలతో నవీకరణ పనులు చేయించారు.